

సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శుక్రవారం । 21 । ఏప్రిల్ । 2023



8లో

భారీతోషికం.. హర్షాతిరేకం
పదో తరగతి పరీక్షల నిర్వహణను ప్రభుత్వ యంత్రాంగం యజ్ఞంలా భావిస్తుంది. పరీక్షల నిర్వహణ, అనంతరం జవాబు పత్రాల మూల్యాంకనం వరకు విద్యాశాఖ ప్రధాన పాత్ర పోషిస్తుంది.



ముగ్గురికి కోవిడ్
కాకినాడ క్రైం: కాకినాడ జిల్లాలో గురువారం ముగ్గురికి కోవిడ్ నిర్ధారణ అయింది. హోం ఐసోలేషన్ చికిత్స అందిస్తున్నట్టు కోవిడ్ సర్వైవలెన్స్ అధికారి డాక్టర్ రవికుమార్ తెలిపారు.

నీటి విడుదల తగ్గింపు

ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు గురువారం నీటి సరఫరాను తగ్గించారు. తూర్పు డెల్టాకు 1,000, మధ్య డెల్టాకు 450, పశ్చిమ డెల్టాకు 1,800 క్యూసెక్కుల నీటిని విడిచి పెట్టారు.



జాగా కొంటే.. భరోసా వెంటే

- 'కోవిడ్' తరువాత ప్రజల్లో మార్పు
- పునర్విభజనతో విస్తరిస్తున్న పట్టణాలు
- పెరుగుతున్న అపార్టుమెంట్ సంస్కృతి
- స్థిరాస్తుల కొనుగోలుకు ఆసక్తి

రెట్టింపవుతున్న రిజిస్ట్రేషన్ ఆదాయం

సాక్షిప్రతినిధి, కాకినాడ: కోవిడ్ తదనంతర పరిణామాలతో ప్రజలు నగదు నిల్వలకు వెనుకంజ వేస్తున్నారు. నగదు నిల్వల కంటే చర, స్థిరాస్తులపై పెట్టుబడికే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ఏదో ఆరోగ్యం, విద్య వంటి అత్యవసరాలకు తప్పించి నగదు తమ వద్ద ఉంచుకోవాలనే ఆలోచనలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. సంపన్నుల నుంచి ఎగువ మధ్యతరగతి వర్గాల వరకు ఎవరిని కదిపినా ఇదే మాట చెబుతున్నారు. ఇంతవరకు కొంతమంది నాలుగు లక్షల రూపాయలు కూడబెడితే చాలు రూ.2 వడ్డీకి అప్పు ఇచ్చి నెలనెలా వచ్చే సొమ్ముతో కాలక్షేపం చేసేవారు. కోవిడ్ సమయంలో సంభవించిన మరణాలు, అనంతరం పెరుగుతున్న హఠాన్మరణాలతో వడ్డీ మాట దేవుడెరుగు.. కనీసం అసలు కూడా తిరిగి రావడం లేదని వారంతా గగ్గోలు పెడుతున్నారు.

అభద్రతతో ఆందోళన

దీనికితోడు మార్గదర్శి, జయలక్ష్మి, కార్తికేయ వంటి సొసైటీలు ప్రజల నుంచి కోట్లు డిపాజిట్లు సేకరించి నిధులు తమ అవసరాలకు మళ్లిస్తున్నాయి. కొన్ని బోర్డు తిప్పేస్తున్నాయి. ఈ పరిణామాలతో డబ్బులు దాచుకున్న వారిలో కూడా అభద్రతా భావం వచ్చేసింది. ఈ పరిస్థితులను బేరీజు వేసుకుని నగదు నిల్వ పెంచుకోవడం కంటే భూములు, ఇళ్ల కొనుగోలు మేలు అని ఎక్కువ మంది భావిస్తున్నారు. స్థిరాస్తులు కూడబెట్టుకుంటే ఏ క్షణాన అవసరం వచ్చినా బ్యాంకుల్లో కుదవ పెట్టుకుని అప్పటికప్పుడు సొమ్ము తెచ్చుకోవచ్చుననే ఒక భరోసా ఇందుకు ప్రధాన కారణం. అప్పులు ఇచ్చి అసలు కోసం పోలీసు స్టేషన్లు, ప్రైవేటు సెటిల్‌మెంట్‌ల కోసం తిరగడం కంటే భూములు, ప్లాట్లు, ఇళ్లు కొనుక్కుని పక్కాగా రిజిస్ట్రేషన్ చేయించుకుంటే గుండెల మీద చేయి వేసుకుని నిద్రపోవచ్చునని భావిస్తున్నారు.



రెండు మూడేళ్లకే రేట్ల పెరుగుదల

నాలుగు డబ్బులు వెనకేసుకునేవారి ఆలోచనలు మారడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో భూములు, ప్లాట్ల క్రయ, విక్రయాలు పెరుగుతున్నాయి. ఏటా రిజిస్ట్రేషన్లు కూడా రెట్టింపవుతున్నాయి. బడా బాబులు భారీగా భూములు కొనుగోలు చేస్తుంటే, ఎగువ ..దిగువ మధ్య తరగతి వర్గాలు కుటుంబ పోషణ పోగా మిగుల్చుకున్న కొద్దిపాటి సొమ్ముతో 100, 150 గజాలు కొనుగోలు చేస్తున్నారు. గజం రూ.15వేలు పెట్టి కొనుగోలు చేసిన స్థలాల రేట్లు రెండు, మూడేళ్లకే పెరిగిపోతున్నాయి. దీంతో ఇది లాభార్జనగా ఉంటుందని మధ్యతరగతి వర్గాలు లెక్కలేసుకుంటున్నాయి. ఇలా కొనుగోలు చేసిన స్థలాలు భవిష్యత్తులో పిల్లల చదువులు, వివాహాలకు కలసి వస్తాయని వారు చెబుతున్నారు. సరళతరంగా బ్యాంకుల్లో వస్తున్న రుణాలు తీసుకుని మరీ స్థలాలు కొనుగోలు చేస్తున్న వారూ లేకపోలేదు. బడాబాబులు, కాంట్రాక్టర్లు, అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చిన వారు సైతం రికవరీ చేసి స్థలాలపై పెట్టుబడి పెడుతున్నారు.

జిల్లాల పునర్విభజన తర్వాత..

కాకినాడ, రాజమహేంద్రవరం నగరాలతో పాటు అమలాపురం సహా రామచంద్రపురం, మండపేట, తుని, సామర్లకోట వంటి పట్టణాల పరిసర ప్రాంతాల్లో స్థలాలు, ప్లాట్ల క్రయ, విక్రయాలు ఇటీవల రెట్టింపయ్యాయి. హాట్‌కేక్‌లుగా అమ్ముడు పోయే ప్రాంతాల్లో స్థలాలు, ప్లాట్లకు గిరాకీ ఎక్కువగా ఉంటోంది. పూర్వపు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్రం కాకినాడ నగర పరిసర ప్రాంతాల్లో స్థలాలు, భూములు, ఇళ్ల కొనుగోలుకు నాడు జిల్లా నలుమూలల నుంచి ఎక్కువ ఆసక్తి కనబరిచేవారు. పునర్విభజన తరువాత కాకినాడతో పాటు అమలాపురం, రాజమహేంద్రవరం జిల్లా కేంద్రాలయ్యాయి. ఇప్పుడు వాటిని ఆనుకుని ఉన్న పరిసర ప్రాంతాల భూములు


క్రయవిక్రయదారులతో కిటకిటలాడుతున్న కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

రియల్ ఎస్టేట్లుగా ఎక్కువ రూపాంతరం చెందుతున్నాయి. అపార్టుమెంట్ సంస్కృతి పెరగడంతో స్థలాల విలువ రెట్టింపు అయింది.

పెరుగుతున్న రియల్ ఎస్టేట్లు

కోనసీమ కేంద్రం అమలాపురానికి ఆనుకుని ఎర్రవంతెన, కామనగరువు, ఈదరపల్లి, పేరూరు, భట్నవిల్లి, బండార్లంక, రాజమహేంద్రవరంలో గోదావరి గట్టు నుంచి తొర్రేడు, మధురపూడి విమానాశ్రయం రోడ్డు నుంచి గాడాల, లాలాచెరువు నుంచి దివాన్‌చెరువు, జాతీయ రహదారి నుంచి శ్రీరామపురం రోడ్డు, రాజవోలు, సంపత్‌నగర్ వరకు నివాస ప్రాంతాలుగా విస్తరిస్తున్నాయి. కాకినాడకు ఆనుకుని మేడలైన్, చీడిగ, కొవ్వాడ, తూరంగి, పెనుగుదురు, సర్పవరం, గైగోలుపాడు, ఏపీఎస్పీ, అచ్చంపేట వాకలపూడి వరకు రియల్ ఎస్టేట్ బూమ్ పెరిగింది. ఫలితంగా రిజిస్ట్రేషన్లు పెరుగుతున్నాయి. జిల్లాల విభజన జరుగుతుందనే ముందుచూపుతో గడచిన రెండేళ్లగా జిల్లా కేంద్రాలకు ఆనుకుని ఐదారు కిలోమీటర్ల వరకు భూములు, స్థలాలు రిజిస్ట్రేషన్లు కూడా పెరిగాయి. పట్టణానికి సమీపాన నాలుగైదు కిలోమీటర్ల వరకు ఖాళీగా ఉన్న పంట భూములు రియల్ ఎస్టేట్‌లుగా మారి నివాసప్రాంతాలు అవుతున్నాయి. గడచిన నాలుగేళ్లగా రిజిస్ట్రేషన్‌లు, డాక్యుమెంట్లు, రిజిస్ట్రేషన్‌ల ఆదాయ గణాంకాలు పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రిజిస్ట్రేషన్, ఆదాయం వివరాలు

సంవత్సరం	దస్తావేజులు	ఆదాయం
2018–19	1,48,213	541.74 కోట్లు
2019–20	1,91,191	592. 07 కోట్లు
2020–21	1,67,095	638.21 కోట్లు
2021–22	2,44,695	907.16 కోట్లు
2022–23	2,66,233	886.88 కోట్లు

భవిష్యత్తుకు భరోసాగా భూములపై పెట్టుబడి


భూములు, స్థలాలు, ప్లాట్లపై పెట్టుబడి పెట్టడమంటే అన్ని వర్గాల ప్రజలు భరోసాగా భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో రిజిస్ట్రేషన్లు పుంజుకున్నాయి. ఆదాయం కూడా బాగా పెరుగుతూ వస్తోంది. కోవిడ్ తరువాత పరిణామాలతో ప్రజల ఆలోచనా విధానం మారింది. భూములపై పెట్టుబడి పెడితే భవిష్యత్తులో వాటి విలువ పెరుగుదలే తప్ప తరుగుదల ఉండదనే నమ్మకం ఏర్పడింది. దీంతో స్థిరాస్థులపైనే ఎక్కువగా డబ్బు పెడుతున్నారు.

– ఎ.నాగలక్ష్మి, డీఐజీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, కాకినాడ.

కొనుగోలు భద్రతనిస్తోంది


భూమి కొనుగోలు కుటుంబానికి భద్రతనిస్తుంది. గతంలో బ్యాంకులో భద్రపరుచుకోవడం, లేకపోతే వడ్డీలకు ఇవ్వడం చేసేవారు. కొన్ని సొసైటీలు రాత్రికి రాత్రే ఎత్తివేయడం, వడ్డీకి తీసుకునే వారు తిరిగి ఇచ్చే విషయంలో ఏర్పడే సమస్యలతో విసుగెత్తిపోయారు. దీంతో రోజురోజుకూ పెరుగుతున్న భూమి రేట్లను దృష్టిలో పెట్టుకుని భూములు కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు.

– జాడ అప్పలరాజు, దస్తావేజు లేఖరి, కాకినాడ

విలువ పెరుగుతుందనే కొన్నాను


రెక్కల కష్టం మీద కుటుంబం నెట్టుకొస్తున్నాను. కూడబెట్టిన కొద్దిపాటి సొమ్మును భూమిపై పెట్టడం మంచిదనుకున్నాను. ముమ్ముందు ఆ భూమి విలువ పెరుగుతుందని 100 గజాల స్థలాన్ని కొన్నాను. ఎక్కడైనా బ్యాంకులో వేద్దామన్నా నమ్మకం కుదరడం లేదు. ఇవన్నీ ఆలోచించే పెట్టిన సొమ్ముకు భరోసాతోపాటు, ధరలు కూడా పెరుగుతాయని జాగా కొనుక్కున్నాను.

– డి.రమేష్, ఇంద్రపాలెం, కాకినాడ

న్యూస్‌రీల్

గృహ నిర్మాణాలు వేగవంతం

సాక్షి అమలాపురం: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి వెలగపూడి సచివాలయం నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ శుక్లా, జేసీ ధ్యానచంద్ర, జిల్లా అధికారులు పాల్గొన్నారు. రీ సర్వేలో భాగంగా సరిహద్దురాళ్ల ఏర్పాటు, రోవర్ల వినియోగం, జాతీయ రహదారులకు, ఇళ్ల స్థలాలకు అవసరమైన భూసేకరణ, స్పందన గ్రీవెన్స్, వ్యవసాయం ఉద్యానం, డెయిరీ డెవలప్‌మెంట్, జగనన్న పాల వెల్లువ, గృహ నిర్మాణం, ఉపాధి హామీ పనుల నిర్వహణపై సమీక్షించారు. అనంతరం జిల్లా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ శుక్లా మాట్లాడుతూ రబీ సాగు పూర్తవుతున్నందున సరిహద్దురాళ్ల ఏర్పాటు వేగవంతం చేయాలన్నారు. చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని సూచించారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్న్ షిప్‌తో ప్రయోజనం: డీఆర్వో సత్తిబాబు
డిగ్రీ పూర్తయిన వెంటనే ఉపాధి పొందేందుకు ఇంటర్న్ షిప్ ప్రాక్టికల్ శిక్షణ దోహదపడుతుందని ఆ దిశగా విద్య, పరిశ్రమలు, వికాసలు సంయుక్తంగా శిక్షణను ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు పేర్కొన్నారు. వికాస, జిల్లా పరిశ్రమల కేంద్రం, ఆదికవి నన్నయ యూనివర్సిటీల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ కళాశాలల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు

సాక్షి అమలాపురం: ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని అమలాపురం ఆర్డీఓ బి.వసంతరాయుడు తెలిపారు. అమలాపురం డివిజన్ పరిధిలో 173 రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆయన డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, మండల వ్యవసాయాధికారులు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్, గ్రామ రెవెన్యూ అధికారులు, సహకార శాఖాధికారులు, కోపరేటివ్ సొసైటీ, రైతు భరోసా కేంద్రాల అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ డివిజన్‌లో 1,78,000 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడిగా వస్తోందన్నారు. ధాన్యం కొనుగోలు ప్రారంభించిన కేంద్రాలకు ఇప్పటికే గోనె సంచులు పంపామని, మిగిలిన కేంద్రాలకు కూడా త్వరలోనే పంపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటల్‌కు రూ.2,060, సాధారణ రకానికి రూ.2,040 కనీస మద్దతు ధర ప్రకటించిందని ఆర్డీఓ తెలిపారు. జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి తులసి పాల్గొన్నారు.

ముస్లింలకు శుభాలు కలగాలి


ఇఫ్తార్ విందుకు ముందు జరిగిన నమాజ్‌లో పాల్గొన్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎంపీ అనురాధ, ఎమ్మెల్యే చిట్టిబాబు

- ఇఫ్తార్ విందులో కలెక్టర్ హిమాన్షు శుక్లా
- పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే

అమలాపురం టౌన్: పవిత్ర రంజాన్ మాసంలో జిల్లాలోని ముస్లింలకు అన్నీ శుభాలే కలగాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆకాంక్షించారు. జిల్లా మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో స్థానిక షాదీ ఖానాలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున గురువారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందులో కలెక్టర్ శుక్లా ప్రసంగించారు. అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, ఇళ్ల వెంకటేశ్వరరావు, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, రాష్ట్ర దృశ్య కళల అకాడమి చైర్‌పర్సన్ కుడుపూడి సత్య శైలజ, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి మునికుమారి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఈడీ సునీల్‌కుమార్ తదితర ప్రముఖులు ఇఫ్తార్ విందులో పాల్గొని ప్రసంగిస్తూ ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. తొలుత కలెక్టర్ శుక్లా ఇఫ్తార్ విందులో వడ్డించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, మున్సిపల్ కౌన్సిల్ విప్ బండారు సత్యనారాయణ, పట్టణ వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ రహమాన్ (రాజా), మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

దిశ, దశ చూపిన నాయకుడు అంబేడ్కర్

మంత్రి విశ్వరూప్

ఉప్పలగుప్తం: రాజ్యాంగాన్ని రూపొందించి అన్నీ వర్గాలకు, మతాలకు, కులాలకు దిశ, దశ చూపిన నాయకుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని సన్నవిల్లి గ్రామంలో రాంజీనగర్‌లో గురువారం నిర్వహించిన అంబేడ్కర్ 132 జయంతి వేడుకలకు ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌తో కలసి మంత్రి విశ్వరూప్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పించారు. మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ప్రపంచ మేధావి అంబేడ్కర్‌ను రాజ్యాంగ నిర్మాణానికి అధ్యక్షులుగా నియమించటంతో ఈ రోజు చట్టసభల్లో అందిరికీ ప్రాముఖ్యత లభించిందన్నారు. ఎంపీ అనురాధ మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే మహిళలు సమాజంలో విద్యా, ఉద్యోగం, రాజకీయాల వైపు అడుగులు వేస్తున్నారన్నారు. చట్టసభల్లో ప్రస్తుతం మన అవసారాల దృష్ట్యా ఆర్టికల్స్ మార్చుకుంటున్నాం తప్ప రాజ్యాంగాన్ని కాదు అని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ చదువుతోనే చక్కటి భవిష్యత్తు సాధ్యం అని అన్నారు. అనంతరం గ్రామంలో పేద మహిళలకు చీరలను పంచారు. జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, సర్పంచ్ చిక్కం జంగమయ్య, ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజాకుమారి, వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి మునికుమారి పాల్గొన్నారు.


అంబేడ్కర్‌కు గజమాలతో నివాళులర్పిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

హామీల అమలులో ఒకే ఒక్కడు సీఎం జగన్

రాజ్యసభ సభ్యుడు సుభాష్ చంద్రబోస్


సభలో మాట్లాడుతున్న ఎంపీ సుభాష్ చంద్రబోస్

తాళ్లరేవు: దేశ చరిత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను పరిపూర్ణంగా అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ కొనియాడారు. గురువారం తాళ్లరేవు మండలం పిల్లంక గ్రామ పంచాయతీలో తాగునీటి ట్యాంకు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నేత చింతలపాటి శ్రీనివాసరాజు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వంపైనైనా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలోనే వారి విశ్వసనీయత బయటపడుతుందన్నారు. 2019 ఎన్నికలలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలలో నాలుగేళ్ల వ్యవధిలోనే 98.5 శాతం హామీలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం 2014లో 164 హామీలు ఇచ్చి కేవలం 15 హామీలు మాత్రమే అమలు చేశారన్నారు. వెనుకబడిన తరగతులకు 112 హామీలు ఇచ్చి కేవలం 12 మాత్రమే అమలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిదన్నారు. ప్రధాన రంగాలైన వ్యవసాయం, విద్య, వైద్యం, సంక్షేమాలకు అధిక నిధులు వెచ్చించి సీఎం పారదర్శక పాలన అందిస్తున్నారన్నారు. అధిక శాతం మంది ఆధారపడ్డ వ్యవసాయ రంగానికి రూ.1.30 లక్షల కోట్ల నిధులు కేటాయించారని తెలిపారు. కోవిడ్ మహమ్మారితో 14 నెలలపాటు పాలన స్తంభించినా ప్రజలకు ఏ మాత్రం కష్టం కలుగకుండా సంక్షేమ పథకాలను అందించి వారి గుండెల్లో గూడుకట్టుకున్నారని అభినందించారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. బొండాలు రకం ధాన్యం సాగుచేసిన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ధాన్యాన్ని కొనుగోలు చేసేవిధంగా చర్యలు చేపడతామన్నారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ప్రసంగించారు.

అభాగ్యులపై వాత్సల్యం

- నెలకు రూ.4 వేలు అందజేత
- ఆర్థిక భరోసా కల్పిస్తున్న ప్రభుత్వాలు
- జిల్లాలో 4,966 దరఖాస్తులు

సాక్షి అమలాపురం: అనాథలు.. అభాగ్యులైన పిల్లల కోసం ప్రవేశపెట్టిన ''మిషన్ వాత్సల్య'' వారికి అండగా నిలవనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రవేశపెట్టిన ఈ పథకంలో లబ్ధి పొందేందుకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించింది. నెలకు రూ.నాలుగు వేలు అందించే ఈ పథకం అభాగ్యులకు చేదోడుగా నిలవనుంది.

నిరాదరణ, పేదరికంతో విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. తల్లిదండ్రులను కోల్పోయిన 6 నుంచి 19 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న పిల్లలు, యువతకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని తీసుకువచ్చాయి. ఒక్కో విద్యార్థికి రాష్ట్రం రూ.1,400, కేంద్రం రూ.2,600 చొప్పున నెలకు రూ.నాలుగు వేలు అందించనున్నాయి. జిల్లాలో ఈ నెల 17వ తేదీ వరకు 4,966 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో బాలురు 2,466 మంది కాగా, బాలికలు 2,500 మంది కావడం విశేషం.

అర్హులు వీరే

- తల్లిదండ్రులను కోల్పోయిన, తల్లిదండ్రులకు దూరమైన పిల్లలు. తల్లి లేక తండ్రిని కోల్పోయిన పాక్షిక అనాథలు. ప్రాణాంతక వ్యాధి బారిన పడిన పిల్లలు, పేదరికంతో ఇంటి పెద్దను కోల్పోయిన పిల్లలు.
- బాలల న్యాయ ఆదరణ, సంరక్షణ చట్టం –2015 కింద సొంత ఇల్లు లేని పిల్లలు. ప్రకృతి వైపరీత్యాలకు గురైన బాలలు, బాల కార్మికులు, అక్రమ రవాణా, దాడులకు గురైన బాలలు, ఇళ్ల నుంచి పారిపోయి వచ్చిన బాల యాచకులు
- బాల్య వివాహ బాధితులు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు (హెచ్ఐవీ)తో బాధపడుతున్న పిల్లలు. కోవిడ్ కారణంగా తల్లిదండ్రులను కోల్పోయినవారు, పీఎం కేర్ ఫర్ చిల్డ్రన్ సహాయం పొందుతున్నవారు అర్హులు.



దరఖాస్తు ఇలా...

- అర్హులైన పిల్లలు తమ గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. లేకుంటే మీ సేవ, ఇంటర్నెట్ కేంద్రాల్లో కూడా దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయి. నిర్దేశిత ధ్రువపత్రాలను అంగన్‌వాడీ లేదా సచివాలయ మహిళా పోలీసుల ద్వారా సమర్పించవచ్చు.
- జనన ధ్రువీకరణ పత్రం, పిల్లల ఆధార్ కార్డు, తల్లిదండ్రుల ఆధార్‌కార్డు లేదా సంరక్షకుని ఆధార్‌కార్డు పొందుపరచాలి. తల్లి లేదా తండ్రి మరణించి ఉంటే దానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు అందించాలి.
- కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, పిల్లల స్టడీ సర్టిఫికెట్, వ్యక్తిగత బ్యాంకు ఖాతా లేదా తల్లిదండ్రులతో కలిసి ఉన్న జాయింట్ అకౌంట్ పొందుపరచాల్సి ఉంటుంది.
- గ్రామాల్లో నివసించే వారికి వార్షిక ఆదాయం రూ.72 వేలు కంటే మించరాదు. పట్టణాల్లో నివసించే వారికి వార్షిక ఆదాయం రూ.96 వేలకు మించరాదు.

ఎంపిక ఇలా..

దరఖాస్తులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సీడీపీఓ కార్యాలయానికి చేరుతాయి. వాటిని మండల స్థాయి కమిటీ తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, సీడీపీవో తదితరులు నిశితంగా పరిశీలిస్తారు. అటుపై అర్హులైన లబ్ధిదారులను జిల్లా కమిటీ ఎంపిక చేస్తుంది. ఈ కమిటీలో మిషన్ వాత్సల్య చైర్మన్ కలెక్టర్, జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారి, సీడబ్ల్యూసీ, డీసీపీవో, ఎస్ఐసీపీవో, ఎన్‌జీఓ సంస్థ నిర్వాహకులు సభ్యులుగా ఎంపిక పూర్తి చేస్తారు.

జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల వారీ వచ్చిన దరఖాస్తులు ఇలా (ఈ నెల 17వ తేదీ నాటికి)

ఐసీడీఎస్ ప్రాజెక్టు	బాలురు	బాలికలు	మొత్తం
అమలాపురం	342	333	675
కపిలేశ్వరపురం	518	507	1,025
కొత్తపేట	367	369	736
ముమ్మిడివరం	475	474	946
పి.గన్నవరం	136	128	264
రాయవరం	317	320	637
రాజోలు	311	369	680
మొత్తం	2,466	2,500	4,966

నిరంతర ప్రక్రియ


అర్హులైన ప్రతీ ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి. ఇది నిరంతర ప్రక్రియ. ప్రతీ మూడు నెలలకు ఒకసారి దరఖాస్తులను పరిశీలించి కాకినాడలో ఉన్న జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్‌కు పంపిస్తాం. వారు మరోసారి పరిశీలించి పైకి పంపిస్తారు. ప్రయార్టీ ప్రకారం వారి అకౌంట్‌లో డబ్బులు పడతాయి. ఇప్పుడు దరఖాస్తు పెట్టుకోనివారు వచ్చే నెలలో పెట్టుకునే అవకాశముంది.

– జి.వి.సత్యవాణి, ఐసీడీఎస్ పీడీ

క్లుప్తంగా

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



ఫెస్ట్ ప్రారంభిస్తున్న వీసీ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): మేనేజ్‌మెంట్ విద్యను అభ్యసించే విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో ఎక్లోర్–2కే23 సదస్సు నిర్వహించారు. వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ వినూత్న కార్యక్రమాలకు, ఆలోచనలకు ఇటువంటి ఫెస్ట్‌లు మంచి వేదికగా నిలుస్తాయన్నారు. ఓఎన్‌జీసీ కాకినాడ అసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రత్నీష్ కుమార్, స్కూల్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ కృష్ణమోహన్, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

నిడదవోలు రూరల్: నిడదవోలు–నవాబుపాలెం రైల్వేస్టేషన్ మధ్యలోని సింగవరం గ్రామ పరిధిలోని ట్రాక్ వద్ద రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి (35) మృతి చెందినట్టు పాల్పడినట్లు తాడేపల్లిగూడెం రైల్వే ఎస్సై జి.శ్రీహరిబాబు తెలిపారు. మృతుడు పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందినవాడిగా భావిస్తున్నామన్నారు. బిస్కెట్ రంగు ఫుల్‌హ్యాండ్స్ షర్ట్‌తోపాటు నీలం రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని చెప్పారు. మృతుడి వివరాలు తెలిస్తే సెల్ నంబర్ 94900 70541కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు పేర్కొన్నారు.

రైళ్లలో చోరీలకు పాల్పడే వ్యక్తి అరెస్ట్

రూ.ఐదు లక్షల విలువైన బంగారు వస్తువులు స్వాధీనం

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం జీఆర్పీ రైల్వే స్టేషన్ పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న విజయనగరం జిల్లా పేరుమాలి గ్రామానికి చెందిన మైలపల్లి పైడిరాజును సుమారు రూ.5 లక్షల విలువైన 131 గ్రాముల బంగారు ఆభరణాలతో అరెస్ట్ చేసి కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్టు జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ విజయశంకర్ తెలిపారు. గురువారం రాజమహేంద్రవరం జీఆర్పీ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. వేసవిలో తరచూ జరిగే దొంగతనాలపై రైల్వే ఎస్పీ విశాల్ గున్ని ఆదేశాలతో డీఎస్పీ బీవీఎస్ నాగేశ్వరరావు పర్యవేక్షణలో రాజమహేంద్రవరం జీఆర్పీ రైల్వే స్టేషన్ పరిధిలో ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య సిబ్బంది సహకారంతో నిఘా పెట్టామన్నారు. ఈ నేపథ్యంలో గురువారం గోదావరి రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన నిఘాలో దొంగతనం చేసేందుకు వచ్చిన పైడిరాజు పట్టుబడ్డాడన్నారు. ముద్దాయిని పట్టుకునేందుకు కృషి చేసిన ఎస్సైలు మావుళ్లు, లోవరాజును అభినందించారు.

భారీ తోషికం.. హర్షాతిరేకం

- 'పది' పరీక్షల ప్రక్రియలో పెరిగిన రెమ్యునరేషన్
- జీవో 37 విడుదల చేసిన ప్రభుత్వం
- జిల్లాలో వేలాదిమంది ఉపాధ్యాయులకు ప్రయోజనం



అమలాపురం స్పాట్ కేంద్రం వద్ద ఉపాధ్యాయులు

రాయవరం: పదో తరగతి పరీక్షల నిర్వహణను ప్రభుత్వ యంత్రాంగం ఒక యజ్ఞంలా భావిస్తుంది. పది పరీక్షల నిర్వహణ, అనంతరం జవాబు పత్రాల మూల్యాంకనం వరకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ప్రధాన పాత్ర పోషిస్తారు. ఈ విధుల నిర్వహణలో పాల్గొనే అధికారులకు, ఉపాధ్యాయులకు పారితోషికం (రెన్యుమరేషన్) ఇస్తారు. అయితే పెరిగిన ఖర్చుల నేపథ్యంలో రెన్యుమరేషన్ పెంచాలనే డిమాండ్ కొన్నేళ్ల నుంచి వస్తోంది. ఉపాధ్యాయ సంఘాలు కూడా ప్రభుత్వానికి విన్నవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గురువారం జీవో 37 విడుదల చేసింది. ఈ జీవో ప్రకారం పదో తరగతి పరీక్షలు, జవాబు పత్రాల మూల్యాంకనంలో పాల్గొనే ఉపాధ్యాయులు, అధికారుల రెన్యుమరేషన్ పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. చివరిగా 2016 మార్చి 31న జీవో 23 ప్రకారం పెంపుదల అనంతరం ఏడేళ్ల తర్వాత రెన్యుమరేషన్ పెరిగినట్లైంది. ప్రభుత్వంపై ఆర్థికంగా భారం పడుతున్నప్పటికీ ఉపాధ్యాయుల సంక్షేమాన్ని కాంక్షించి రెన్యుమరేషన్ పెంచిందనే భావన ఉపాధ్యాయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

ఈ ఏడాది నుంచే అమలు

పది పరీక్షల నిర్వహణ, జవాబు పత్రాల మూల్యాంకనంలో వివిధ దశల్లో పాల్గొనే అధికారులకు, ఉపాధ్యాయులకు పారితోషికం పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచే పెరిగిన రెన్యుమరేషన్‌ను అమలు పర్చనున్నారు. పది పరీక్షల నిర్వహణలో పేపర్ సెట్టర్స్, ట్రాన్స్‌లేటర్స్, మోడరేటర్, సీఎస్, డీవోలు, ఇన్విజిలేటర్లు, క్లర్క్‌లు, అటెండర్స్, వాటర్ మెన్స్, సిట్టింగ్ స్క్వాడ్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్, వైద్య ఆరోగ్య సిబ్బంది, జిల్లా స్థాయి పరిశీలకులు పాల్గొంటారు. పరీక్షల అనంతరం జవాబు పత్రాల మూల్యాంకనంలో క్యాంప్ ఆఫీసర్, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్ (స్ట్రాంగ్ రూమ్), (అడ్మినిస్ట్రేటర్), అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్, చీఫ్ ఎగ్జామినర్, అసిస్టెంట్ ఎగ్జామినర్, స్పెషల్ అసిస్టెంట్లు, క్లరికల్ అసిస్టెంట్లు, కార్యాలయ సబార్డినేట్స్, చీఫ్ కోడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ కోడింగ్ ఆఫీసర్, ఎగ్జామినర్స్ ఫర్ ప్రిపేరింగ్ ప్రిన్సిపల్ ఆఫ్ వాల్యుయేషన్‌లు పాల్గొంటారు. వీరికే కాకుండా కంటింజెన్సీకి కూడా నిధులు పెంచారు.

మూడు వేల మందికి ప్రయోజనం

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పదవ తరగతి పరీక్షలు, జవాబు పత్రాల మూల్యాంకనంలో సుమారుగా మూడు వేల మంది సిబ్బంది పాల్గొన్నారు. వీరందరికీ ప్రయోజనం చేకూరనుంది. పది పరీక్షల్లో 111 మంది వంతున సీఎస్, డీవోలు, 10 మంది ఏడీవోలు, 1,092 మంది ఇన్విజిలేటర్లు, ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్స్‌తో పాటు 111 పరీక్షా కేంద్రాల్లో వాటర్ మెన్స్, క్లరికల్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. జవాబు పత్రాల మూల్యాంకనంలో 606 మంది ఏఈలు, 188 మంది సీఈలు, 250 మంది స్పెషల్ అసిస్టెంట్లతో పాటుగా, క్యాంప్ ఆఫీసర్, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్లు, అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు, కోడింగ్, సహాయ కోడింగ్ అధికారులు పాల్గొన్నారు. వీరందరికీ పెరిగిన పారితోషికం వర్తిస్తుంది.

పెరిగిన పారితోషికం ఇలా..

కేటగిరీ	ప్రస్తుతం ఇస్తున్నది (రూ.రోజుకు)	పెరిగినది (రూ.రోజుకు)
పేపర్ సెట్టర్ (ప్రతి పేపరుకు)	రూ.880	రూ.1,320
ట్రాన్స్‌లేటర్(ప్రతి పేపరుకు)	రూ.770	రూ.1,155
మోడరేటర్ (ప్రతి పేపరుకు)	రూ.770	రూ.1,155
చీఫ్ సూపరింటెండెంట్	రూ.44	రూ.66
డీవో/ఏడీవో	రూ.44	రూ.66
ఇన్విజిలేటర్	రూ.22	రూ.33
క్లర్క్	రూ.22	రూ.33
అటెండర్స్	రూ.13.20	రూ.20
వాటర్‌మెన్	రూ.11	రూ.17
సిట్టింగ్ స్క్వాడ్స్	రూ.44	రూ.66
వైద్య సిబ్బంది	రూ.22	రూ.33
జిల్లా స్థాయి పరిశీలకులు	రూ.200	రూ.300
మూల్యాంకనంలో పాల్గొనే వారికి..		
క్యాంప్ ఆఫీసర్	రూ.385	రూ.578
డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్లు	రూ.330	రూ.495
అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్	రూ.286	రూ.429
చీఫ్ ఎగ్జామినర్ (రోజుకు)	రూ.264	రూ.396
ఏఈలు (ప్రతి పేపరుకు)	రూ.6.60	రూ.10
స్పెషల్ అసిస్టెంట్లు	రూ.137.50	రూ.300
క్లరికల్ అసిస్టెంట్లు	రూ.88	రూ.132
ఆఫీస్ సబార్డినేట్స్	రూ.55	రూ.83
చీఫ్ కోడింగ్ ఆఫీసర్	రూ.220	రూ.330
సహాయ కోడింగ్ ఆఫీసర్	రూ.198	రూ.297
ప్రిన్సిపల్స్ ఆఫ్ వ్యాల్యుయేషన్	రూ.250	రూ.375

ఉత్తర్వుల ప్రకారం చెల్లింపులు



ప్రస్తుతం స్పాట్ వాల్యుయేషన్ కొనసాగుతోంది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం రెమ్యునరేషన్ చెల్లిస్తాం. ఉత్తర్వుల కాపీ అధికారికంగా అందిన వెంటనే తదుపరి చర్యలు తీసుకుంటాం.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

శుభ పరిణామం



సుమారు ఏడేళ్ల అనంతరం ప్రభుత్వం రెన్యుమరేషన్ పెంచడం శుభపరిణామం. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించడం సంతోషంగా ఉంది. ఇదే విధంగా అన్ని సమస్యల పట్ల సానుకూల దృక్పథంతో ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నాం.

– తెలగాని తిలక్‌బాబు, జిల్లా అధ్యక్షుడు, పీఆర్‌టీయూ, ద్రాక్షారామం

ఆశాజనకం



సమకాలీనంగా పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం రెన్యుమరేషన్ పెంపుదల చేయడం అభినందనీయం. విద్యాక్షేత్రంలో వివిధ అభివృద్ధి పనులకు అధిక నిధులు వెచ్చించడం కూడా ఆశాజనక పరిణామం. ఇదే ఒరవడిని ప్రభుత్వం కొనసాగించాలి.

– నాగిరెడ్డి శివప్రసాద్, జిల్లా అధ్యక్షుడు, ఎస్‌టీయూ, అమలాపురం.

కొంతమేర ప్రయోజనమే



ప్రభుత్వం పదో తరగతి పరీక్షల నిర్వహణ, స్పాట్ వాల్యుయేషన్‌కు పెంచిన రెన్యుమరేషన్ కొంత వరకు ప్రయోజనకరంగా ఉంది. ఓపెన్ స్కూల్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం రెన్యుమరేషన్‌తో సమానంగా పెంచి ఉంటే మరింత ప్రయోజనకరంగా ఉండేది.

– పెంకే వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు, యూటీఎఫ్, అమలాపురం

తమ్ముళ్ల కుమ్ములాట



ఏలేశ్వరంలో బహిరంగంగా ఘర్షణ పడుతున్న తెలుగు తమ్ముళ్లు

- చంద్రబాబు జన్మదిన వేడుకల్లో బయటపడ్డ విభేదాలు
- వరుపుల రాజా వర్గీయులను అడ్డుకున్న పైల బోస్ అనుచరులు

ఏలేశ్వరం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకల నేపథ్యంలో పట్టణంలో తెలుగు తమ్ముళ్లు గురువారం బహిరంగంగా ఘర్షణకు దిగారు. నియోజకవర్గ మాజీ కన్వీనర్ వరుపుల రాజా భార్య, ప్రస్తుత కన్వీనర్ వరుపుల సత్యప్రభ వర్గీయులకు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పైల సుభాష్‌చంద్రబోస్ అనుచరులకు మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొనడంతో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. దీంతో కాసేపు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. వరుపుల సత్యప్రభ వర్గీయులు వెనుతిరగడంతో పరిస్థితి చక్కబడింది. వివరాల్లోకి వెళితే చంద్రబాబు జన్మదిన వేడుకల్లో భాగంగా స్థానిక బాలాజీచౌక్ వద్ద ఉదయం పదిగంటల ప్రాంతంలో కేక్ కట్ చేసేందుకు వరుపుల సత్యప్రభ వర్గీయులు సిద్ధమయ్యారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జ్యోతుల పెదబాబు, మండల కన్వీనర్ సూతిబూరయ్య, మున్సిపల్ కౌన్సిలర్ మూది నారాయణస్వామి అక్కడకు వచ్చారు. వారు కేక్ కట్ చేసేందుకు సిద్ధమవ్వగా పైల బోస్ వర్గీయులు అక్కడకు చేరుకున్నారు. తొలినుంచి పార్టీలో ఉన్న తమకు చెప్పకుండా జన్మదిన వేడుకలు చేయడం సరికాదని వాగ్వాదానికి దిగారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు, కార్యకర్తలకు పిలుపు లేకుండా వేడుకలు నిర్వహించడంపై వారిని నిలదీశారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరినొకరు తోసుకున్నారు. దీంతో వరుపుల వర్గీయులు వెనుదిరగడంతో పట్టణ అధ్యక్షుడు సతివాడ రాజేశ్వరరావు, పైల అయ్యప్ప, వాగు రమేష్ తదితరులు కేక్ కట్ చేశారు. ఇప్పటివరకు అంతర్గతంగా తగదాలు పడిన తెలుగు తమ్ముళ్ల పట్టణ నడిబొడ్డున బహిరంగంగా ఘర్షణకు దిగడం గమనార్హం. టీడీపీ క్రమశిక్షణకు మారుపేరని పదేపదే చెప్పే చంద్రబాబు మాటలు నీటిమూటలేనని మరోసారి రుజువయ్యింది.

9వ తరగతి విద్యార్థిపై సహ విద్యార్థి చాకుతో దాడి

పరీక్ష హాలులో దారుణం



గాయపడిన విద్యార్థి శ్రీహరిసాయిప్రసాద్

రాజానగరం: తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిపై మరో విద్యార్థి చాకుతో దాడి చేసి, తీవ్రంగా గాయపరిచాడు. ఉన్నత పాఠశాల మొదటి అంతస్తులో ఫైనల్ ఎగ్జామ్స్ ప్రారంభమైన మొదటి రోజున, పరీక్ష కేంద్రంలో, ఇన్విజిలేటర్ ఎదురుగా ఈ సంఘటన జరగడం తీవ్ర సంచలనం కలిగించింది. మరో గంటలో పరీక్ష ముగుస్తుందనగా కూర్చున్నచోటు నుంచి దురుసుగా లేచిన విద్యార్థి, అదే హాలులో పరీక్ష రాయడంలో నిమగ్నమైవున్న పెంకె శ్రీహరిసాయిప్రసాద్‌ను చాకుతో హతమార్చే ప్రయత్నం చేశాడు. ఈ సమయంలో వెంటనే అప్రమత్తమైన ప్రసాద్ తనను తాను కాపాడుకునేందుకు చేతులు అడ్డుపెట్టడంతో చాకు అతని చేతి నరాలను కట్ చేసింది. ఎడమ చెంప చెవి నుంచి దవడ వరకు రెండుగా చీలిపోయింది. ఈ క్రమంలో దాడి చేస్తున్న విద్యార్థిని అడ్డుకోబోయిన ఇన్విజిలేటర్‌ని కూడా బెదిరించి అతను పరారయ్యాడు. కారుతున్న రక్తంతో ప్రాణాలు కాపాడుకునేందుకు ప్రసాద్ హెచ్‌ఎం రూమ్‌కు పరుగుతీశాడు. దీనితో ఆ మార్గంతో పాటు హెచ్‌ఎం రూమ్, వరండా అంతా రక్తమయమైపోయింది. వెంటనే హెచ్‌ఎం కామేశ్వరరావు ఆ విద్యార్థిని చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం తరలించి, అతని తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. విషయం తెలుసుకున్న రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆ విద్యార్థికి మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారు. కేసును రాజానగరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వ్యక్తిగత ద్వేషాలే ఈ దాడికి కారణమని పోలీసులు భావిస్తున్నారు.

గోదావరిలో గల్లంతైన బాలుర మృతదేహాల లభ్యం



మృతిచెందిన చిరంజీవి (ఫైల్)



గోదావరి నదిలో పడి మృతిచెందిన చిరంజీవి



గోదావరి నదిలో పడి మృతిచెందిన వెంకటదేవేంద్ర

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం పుష్కరాల రేవు వద్ద గల్లంతైన ఇద్దరు బాలుర మృతదేహాలు గురువారం లభ్యమయ్యాయి. శాటిలైట్ సిటీ ఏ బ్లాక్‌కు చెందిన తాడి చిరంజీవి, గోదాటి వెంకటదేవేంద్ర తోటి స్నేహితులతో కలసి గోదావరిలో స్నానం చేసేందుకు బుధవారం రాత్రి పుష్కరాల రేవుకు వచ్చి గల్లంతైన విషయం తెలిసిందే. అర్ధరాత్రి కావడంతో గాలించే వీలు లేక ఉదయం ఎనిమిది గంటల నుంచి గోదావరి నదిలో జాలర్లతో వెతికించారు. కొద్ది సమయానికి చిరంజీవి, వెంకటదేవేంద్ర మృతదేహాలు జాలర్ల వలకు చిక్కాయి. వాటిని ఒడ్డుకు తీసుకువచ్చారు. త్రీటౌన్ ఎస్సై రామారావు నేతృత్వంలో పోలీసులు ఆ ఇద్దరి బాలుర మృతదేహాలు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విషాద ఛాయలు

శాటిలైట్ సిటీ ఎ బ్లాకులోని చిరంజీవి, వెంకట దేవేంద్రల ఇంటి వద్ద విషాద ఛాయలు అలముకున్నాయి. జెడ్పీ హైస్కూలులో చిరంజీవి ఎనిమిదో తరగతి, వెంకట దేవేంద్ర తొమ్మిదో తరగతి చదువుతున్నారు. చిరంజీవి కొద్దిరోజులుగా స్కూలుకు రావడం లేదని పాఠశాల ఉపాధ్యాయుడు చెబుతున్నారు. అయితే తమతో చదువుకుంటున్న చిరంజీవి, వెంకటదేవేంద్ర చనిపోయారని తెలిసి తోటి విద్యార్థులు ఆవేదనకు గురయ్యారు. పోస్టుమార్టం నిర్వహిస్తున్న ప్రభుత్వాసుపత్రి వద్ద ఇరువురు బాలల కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబీకులు అందజేసినట్లు త్రీటౌన్ ఎస్సై రామారావు తెలిపారు.

'నన్నయ' నుంచి పీహెచ్‌డీ పొందిన నైనా జైస్వాల్

22 ఏళ్ల వయస్సులో పీహెచ్‌డీ అందుకున్న తొలి భారతీయ యువతి



రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టాను అందుకుంటున్న నైనా జైస్వాల్

రాజానగరం: అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్ ఆదికవి నన్నయ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీని పొందారు. 22 ఏళ్ల వయస్సులో పీహెచ్‌డీని పొందిన భారతీయ తొలి యువతిగా నిలిచిన ఆమెకు ఏపీ గవర్నర్, 'నన్నయ' వర్సిటీ చాన్సలర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఈ పీహెచ్‌డీ పట్టాను అమరావతిలో గురువారం అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లాకు సంబంధించి మహిళా సాధికారతలో మైక్రో ఫైనాన్స్ పాత్రపై ఆమె చేసిన అధ్యయనానికి ఈ పీహెచ్‌డీ లభించింది. పూర్వపు ఉపకులపతి ఆచార్య ఎం.ముత్యాలునాయుడు ఆమెకు గైడ్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా నైనా జైస్వాల్ మాట్లాడుతూ భారతదేశంలో 22 ఏళ్ల వయస్సులో పీహెచ్‌డీని అందుకున్న తొలి భారతీయ యువతిని తాను కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ అనుభూతి తనకు 8వ ఏట నుంచే ప్రారంభమైందని, ఆ వయస్సులోనే లండన్‌లోని కేంబ్రిడ్జి యూనివర్సిటీ నుంచి 10వ తరగతి పూర్తి చేసి, ఆసియాలో పిన్న వయస్కురాలిగా గుర్తింపు పొందానన్నారు. 10వ ఏట ఇంటర్మీడియెట్, 13వ ఏట గ్రాడ్యుయేషన్ పూర్తి చేశానన్నారు. ఎంఏ పూర్తి చేసి 22 ఏట పీహెచ్‌డీ అందుకున్నానని జైస్వాల్ వివరించారు. ఇకపై తన ఏకైక లక్ష్యంగా పెట్టుకున్న సివిల్స్ సాధించడమే తరువాయిగా పేర్కొన్నారు. తన మార్గదర్శకంలో పీహెచ్‌డీని అందుకున్న నైనా జైస్వాల్ భారతీయ తొలి యువతి కావడం సంతోషంగా ఉందని గైడ్‌గా వ్యవహరించిన 'నన్నయ' వర్సిటీ పూర్వపు వీసీ ఆచార్య ఎం. ముత్యాలునాయుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో నైనా జైస్వాల్ తల్లిదండ్రులు అశ్విన్‌కుమార్ జైస్వాల్, భాగ్యలక్ష్మి, తమ్ముడు అగస్త్య కూడా పాల్గొన్నారు.

కి'లేడీ' డాక్టర్

- జీజీహెచ్‌లో నకిలీ వైద్యురాలి హల్‌చల్
- ఉద్యోగాలిప్పిస్తానంటూ డబ్బు వసూలు
- సెక్యూరిటీ గార్డుకు చిక్కిన వైనం
- వన్‌టౌన్ పోలీసుల అదుపులో నిందితురాలు



అవుట్‌పోస్టు పోలీసుల అదుపులో అరుణ



ఏప్రాన్, స్టెత్‌స్కోప్‌తో వైద్యురాలిగా హల్‌చల్

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో ఓ నకిలీ డాక్టర్ హల్‌చల్ చేసింది. ఉద్యోగాలిప్పిస్తానంటూ అమాయకులను నమ్మించి రూ.లక్షల్లో వసూలు చేసింది. ఏ ఒక్కరికీ అనుమానం రాకుండా డాక్టర్ ఏప్రాన్, మెడలో స్టెత్‌స్కోప్ ధరించి పకడ్బందీగా మోసానికి తెరతీసింది. ఆమె హడావుడి చూసిన అమాయక బాధితులు వైద్యురాలని భావించి, తమకి ఉద్యోగాలిప్పిస్తుందని గుడ్డిగా నమ్మి రూ.వేల మొత్తాల్ని కట్టబెట్టారు. ఆసుపత్రిలో విధులు నిర్వర్తిస్తున్న ఓ సెక్యూరిటీ గార్డుకు ఆమె వ్యవహారశైలిపై అనుమానం రావడంతో మోసం బట్టబయలైంది. ఎట్టకేలకు పోలీసులకు చిక్కింది. వివరాలివీ.. సామర్లకోటకు చెందిన 24 ఏళ్ల సానా అరుణ జీఎన్‌ఎం పూర్తి చేసి ఉద్యోగం కోసం పలు ప్రయత్నాలు చేసింది. ఈ ప్రయత్నాల్లో ఉండగానే తనకు కాకినాడ జీజీహెచ్‌లో ఉద్యోగం వచ్చిందని తండ్రి, సోదరుడిని నమ్మించింది. జీజీహెచ్‌లో వైద్యులు ధరించే ఏప్రాన్ వేసుకొని హడావుడిగా తిరుగుతూ వారికి పలుమార్లు కనిపించి నమ్మకం కలిగించింది. ఈ క్రమంలోనే ఉద్యోగ అవసరంలో ఉన్న బయట వ్యక్తులకు ఉద్యోగాలిప్పిస్తానంటూ వల వేసి సొమ్ము చేసుకునే కుయుక్తులు పన్నింది. అనుకున్నదే తడవుగా ఏప్రాన్ వేసి మెడలో స్టెత్ ధరించి అమాయక రోగులు వారి బంధువులతో మాట కలిపేది. వారు ఉద్యోగ అవసరంలో ఉన్నారని గ్రహిస్తే తాను ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నమ్మబలికేది. ఇదే తరహాలో పోలీసులకు అందిన సమాచారం వరకు నలుగురిని మోసం చేసింది. వారి నుంచి రూ.వేల మొత్తాన్ని వసూలు చేసి మొత్తంగా రూ.3–4 లక్షలు కూడబెట్టి సొంత అవసరాల కోసం వాడుకుంది. ఉద్యోగాల సంగతేమైందంటూ అడిగిన బాధితుల ఫోన్లకు స్పందించేది కాదు. ఈ క్రమంలో ఇంద్రపాలేనికి చెందిన శృంగవరపు మాధురి మిగిలిన బాధితులతో కలిసి పలుమార్లు జీజీహెచ్‌లో వెదికినా అరుణ వారికి కనిపించకుండా తప్పించుకొని తిరిగేది. ఈ నేపథ్యంలో దొడ్డి ధనలక్ష్మి అనే సెక్యూరిటీ గార్డు ఆమె వ్యవహారశైలిని అనుమానించి అవుట్‌పోస్టు పోలీసులకు పట్టించింది. వారు విచారిస్తే బాధితుల పేర్లు బయటపెట్టింది. బాధితులు ఆసుపత్రికి చేరుకొని సెక్యూరిటీ సిబ్బందితో కలిసి అరుణను గురువారం వన్ టౌన్ పోలీసులకు అప్పగించారు. ఆసుపత్రి అధికారుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంకెవరినైనా మోసగించిందా అన్న కోణంలో విచారణ కొనసాగిస్తున్నారు.